# మరో మజిలీ

ఒక కవిశేఖరుడు ఆకలితో మాడిపోతూ ఒక శ్రీమంతుణ్ని ఆశ్రయించి, "అయ్యా! ఆకలితో మాడిపోతున్నాను, ఏదైనా సహాయం చెయ్యండి!" అని అర్థించాడు.

అందుకా శ్రీమంతుడు "కవిగారూ! మీరు కాలం చేశాక మీ స్మారకార్థం ఎక్కడో ఓ దగ్గర విగ్రహ ప్రతిష్ఠాపన చెయ్యక తప్పదు. అప్పుడెలాగూ నేను విరాళం ఇవ్వాలి. ఇప్పుడోమాటు, అప్పుడోమాటు ఇవ్వలేను. ఏకంగా అప్పుడే ఇస్తాను!" అన్నాడట.

ఇలా ఉంది మన దేశంలోని బీద కవుల కళాకారుల దుస్థితి. బతికున్నప్పుడు చూడరు కాని, చచ్చాక చూస్తాడట!

ఈ దురభిప్రాయాన్ని వమ్ము చేయాలని నిశ్చయించుకున్నాడు కళాభిమాని సుధాంశువు. ఆ ఊళ్లో 'తిమిరారి' అనే సంగీత విద్వాంసుడు కొంచెం లేమిలో ఉన్నాడు. అతని కో సన్మానం ఏర్పాటు చేసి ఊళ్లో ఉన్న ప్రముఖుల నుండి విరాళాలు సేకరించి కనీసం ఓ పదివేల రూపాయలైనా ఇప్పించాలని సుధాంశువు పట్టుదల. అలా తిరగ్గా తిరగ్గా ఎలాగో ఐదువేలు పోగయ్యాయి. కొందరు శ్రీమంతులు ఇస్తానని 'ప్రామిస్' చేశారు. వాళ్లెప్పటికైనా ఇస్తారనే ఆశతో కళాభిమాని సుధాంశువు భూమి తనచుట్టూ తిరుగుతున్నట్టు తిరుగుతూనే ఉన్నాడు.

ఈలోగా సంగీత విద్వాంసుడైన తిమిరారి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స చేయించడానికి ధనం అనే ఇంధనం లేదు. ఈయనకు సన్మానం చేయించి ఆర్థిక సహాయం చేసేలోగానే ఆయన ఏమైపోతాడో ననే బెంగతో కళాభిమాని సుధాంశువు తిమిరారి ఇంటికి వెళ్లి తన వద్ద ఉన్న ఐదు వేల రూపాయలూ ఇద్దామనుకున్నాడు.

ఎదురుగా తిమిరారి శవం రుద్రభూమికి ప్రయాణమైంది.

కళాభిమాని సుధాంశువు ఎంతగానో మథనపడ్డాడు. సమయానికి ఆర్థిక సహాయం చేయలేకపోయానే అని చాలా క్షోభించాడు.

చివరికి సంగీత విద్వాంసుడైన తిమిరారి విగ్రహ ప్రతిష్ఠాపన ఆరు నెలల్లో జరిగిపోయింది. ఆనాడే ప్రభుత్వం ఆ సంగీత విద్వాంసునికి 'మరణానంతర పురస్కారం' ప్రకటించింది.

సినిమా ముగిశాక టిక్కెట్లమ్మారు.

ఎగురుతూ ఎగురుతూ మధ్యమధ్య మజిలీ చేస్తూ రెట్టలు వేయడానికి పక్షులకు మరో ఆశ్రయం దొరికింది!

**ఆంధ్రప్రభ వీక్లీ ఆగస్టు 31-6 సెప్టెంబరు 1994**